సాక్షి
అనకాపల్లి

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



దిబ్బిడిలో అతిసార

బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడిలో అతిసార విజృంభించి వృద్ధుడు మృతి చెందాడు. పలువురు ఆస్పత్రి పాలయ్యారు. 2లో



బాలల్లో సృజనాత్మక స్ఫూర్తి

కశింకోటలో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలో రాష్ట్ర స్థాయికి ఏడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. 2లో



ఘనంగా తులసీ దళార్చన

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం అమ్మవారికి సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



అధికారులకు సూచనలు చేస్తున్న ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నర్సీపట్నం: లైసెన్స్ పొందిన వారు మాత్రమే దీపావళి బాణసంచా అమ్మకాలు సాగించాలని, అనుమతి లేని విక్రేతలపై చర్యలు తప్పవని ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే పెద్దచెరువు ప్రాంతాన్ని మున్సిపల్, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. దుకాణాల ఏర్పాటుపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లైసెన్స్‌లో పేర్కొన్న విధంగా నిర్ణీత మోతాదులోనే బాణసంచా దుకాణాల్లో ఉండాలన్నారు. బాణసంచా విక్రయదారులు విధిగా ఫైర్ సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, ఫైర్ అధికారి పి.స్వామి, ఆర్ఐ వెంకటలక్ష్మి ఉన్నారు.

రిసోర్స్ పర్సన్లకు ముగిసిన శిక్షణ



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో డీఆర్‌పీలకు లిప్ శిక్షణ

కశింకోట: అభ్యసన నైపుణ్యాలు పెంపొందేలా జిల్లా రిసోర్స్ పర్సన్లకు (డీఆర్‌పీలు) నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడానికి రెండు రోజులపాటు శిక్షణ అందించారు. జిల్లాలోని వంద మంది డీఆర్‌పీలకు తెలుగు, ఇంగ్లీషు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చారు. వీరు ఇక్కడ నేర్చుకున్న అంశాలపై కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు తమ పరిధిలో శిక్షణ ఇస్తారు. వారు ఈ మేరకు తమ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక బోధన సాగిస్తారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మురళీమోహన్ పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఎం.ఆర్.వి.అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

అథ్లెట్ జ్యోతి



స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

విశాఖ స్పోర్ట్స్: విశాఖ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం ఎంతో గర్వకారణంగా ఉందని అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ తెలిపింది. హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆమెకు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. వివిధ పాఠశాలల విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా జ్యోతి 'సాక్షి'తో మాట్లాడుతూ తన లక్ష్యం ఒలింపిక్స్‌లో పతకం సాధించడమేనని చెప్పింది. అయితే ఇంకా ఎటువంటి ప్రిపరేషన్ మొదలు కాలేదని, కోచ్ నిర్ణయం మేరకు ప్రాక్టీస్ సెషన్ ప్రారంభిస్తానంది. విశాఖ నుంచి ఒలింపిక్స్‌లో అందునా అథ్లెటిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా ఉందన్నారు.

ఇది కదా అభిమానమంటే...
ఇది కదా సంక్షేమ పాలనంటే..
ఇది కదా.. అభివృద్ధి అంటే..

అనకాపల్లిలో సామాజిక సాధికార బస్సు యాత్ర హోరెత్తించింది.. ఊరూవాడా కదిలొచ్చిందా.. జన ప్రవాహమై పరవళ్లు తొక్కిందా.. అనిపించింది. నాయకులకు జనం బ్రహ్మరథం పట్టారు. జననేత జగన్ జనంలోకి వచ్చినంత సంబ్రమంగా... ఆయన పంపిన దూతలకు అడుగడుగునా ఘన స్వాగతం చెప్పారు. వైఎస్సార్‌సీపీ 53 నెలల సంక్షేమ పాలనకు జేజేలు పలికారు.



అనకాపల్లి సభకు హాజరైన జన సందోహంలో ఒక భాగం

అనకాపల్లి అదరహో

- జన సునామీలా ఎన్టీఆర్ స్టేడియం
- దద్దరిల్లిన అనకాపల్లి సామాజిక సాధికార సభ
- అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం
- ఉత్తరాంధ్రలో తొలి విడత యాత్రకు ఘన ముగింపు
- వేలాది బైక్‌లు, వందలాది ఆటోలు, కార్లతో ర్యాలీ
- పలు నూతన భవనాలు ప్రారంభోత్సవం

సాక్షి, అనకాపల్లి: పట్టణంలో ఎటు చూసినా జన సందోహమే.. రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.. దార్లన్నీ ఎన్టీఆర్ స్టేడియం వైపే చూపించాయి. ఇక్కడ మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ జన సంద్రాన్ని తలపించింది. ఈ సందర్భంగా సభలో పలువురు వైఎస్సార్‌సీపీ మంత్రులు, నేతలు ప్రసంగించారు. అంతకు ముందు అశేష జనవాహినిలో సాగిన తొలి విడత సామాజిక సాధికార బస్సు యాత్ర ఘనంగా ముగిసింది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో మారేడుపూడిలో గురువారం ఉదయం 11.30 గంటలకు సామాజిక సాధికార బస్సుయాత్రను వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మంచిని వివరించడానికిగాను **చేపట్టిన ఈ బస్సు యా**త్రలో నియోజకవర్గంలో అన**కాపల్లి రూరల్, కశింకోట** మండలాల నుంచి వేలాది మం**ది స్వచ్ఛందంగా పాల్గొ**న్నారు. వేలాది బైక్‌లు, ఆటో**లు, వందలాది కార్ల**తో ర్యాలీగా సాగింది. ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఆ సమయంలో మహిళల కోలాటాలతోపాటు జై జగన్.. జై గుడివాడ నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. మారేడుపూడి నుంచి జాతీయ రహదారి మీదుగా బస్సు యాత్ర కశింకోట మండలం బయ్యవరం, తేగాడ చేరుకుంది. ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లలో పార్టీ శ్రేణులు టపాసులతో, మందుగుండు పేలుళ్లతో స్వాగతం పలుకుతూ సందడి చేశాయి. ముందుగా మారేడుపూడికి చేరుకున్న వైవీ సుబ్బారెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలను అందించి ఘన స్వాగతం పలికారు. తేగాడలో జగనన్న కాలనీని, నూతన సచివాలయం, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో కలిసి ప్రారంభించారు.

వైఎస్సార్ విగ్రహానికి ఘన నివాళి

అనకాపల్లి పూడిమడక జంక్షన్‌లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, ధర్మాన ప్రసాదరావు, ఎంపీ బీవీ సత్యవతి నివాళులర్పించారు. నియోజకవర్గం పరిశీలకుడు రొంగలి జగన్నాథం, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, విశాఖ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ పాల్గొన్నారు.



సామాజిక సాధికార సభలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, వేదికపై డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్యే గణేష్ తదితరులు



హోరెత్తిన బైక్ ర్యాలీ



సభా ప్రాంగణంలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి ధర్మాన తదితరులు



అనకాపల్లిలో జనమే జనం.. కోలాహలం

గురునాథరావు గుర్తొచ్చారు



ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జనసందోహం చూస్తే అన్న గుడివాడ గురునాథరావు గుర్తొస్తున్నారు. అప్పుడు ఆయన నాయకత్వంలో ఇంత జన సందోహం చూశాం. ఇప్పుడు ఆయన తనయుడు చిరంజీవి గుడివాడ అమర్‌నాథ్ నాయకత్వం చూస్తుంటే ఆనందంగా ఉంది. గురునాథరావు నుంచి నేర్చుకున్న రాజకీయ పాఠాలే నన్ను మా మాడుగుల నియోజకవర్గంలో ప్రజలకు చేరువ చేశాయి. ఆయన పార్టీ కార్యకర్తలను, నాయకులను పేరు పెట్టి పిలిచి ఆప్యాయంగా బాగోగులు అడిగేవారు.

–డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

అందరికీ కృతజ్ఞతలు



అనకాపల్లి సామాజిక సాధికార యాత్రకు వచ్చిన జన సునామీతో ఉత్తరాంధ్ర బస్సుయాత్రకు ముగింపు పలకడం చాలా సంతోషంగా ఉంది. ఎన్టీఆర్ క్రీడా మైదానం కిటకిటలాడింది. ఇంత జనం హాజరై వైఎస్సార్‌సీపీకి అండగా నిలవడం అపూర్వం. నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

–మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అనకాపల్లి టౌన్: సామాజిక సాధికార యాత్రతో అనకాపల్లి పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. మారేడుపూడి జాతీయ రహదారిలో ప్రారంభమైన బస్సు యాత్ర కశింకోట బయ్యవరం మీదుగా తేగాడ గ్రామానికి చేరుకుని అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన పలువురు మంత్రులు తిరిగి స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానానికి చేరుకుంది. అక్కడ సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలతో సభా స్థలి జనసంద్రమైంది. అనకాపల్లి పట్టణ, మండల, కశింకోట మండలం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని మంత్రుల ప్రసంగంలో విని ప్రజల్లో ఉత్సాహం ఉరకలేసింది. అనకాపల్లి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఇటువంటి భారీ బహిరంగ సభ చేపట్టలేదనే చెప్పాలి. సభకు వచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, మైదానంలో గ్యాలరీలు ఏర్పాటు చేయడంతో కడ వరకు ఆసక్తిగా ప్రసంగాన్ని విన్నారు. స్థానిక ప్రధాన రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. ఎక్కడ చూసినా బస్సుయాత్రపై చర్చే కనిపించింది. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మంచి పాలన పొందాలనే భావన ప్రతి ఒక్కరిలో మొదలైందనే చెప్పాలి. విశాఖ జోన్ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



హుషారెత్తించిన పులి వేషాలు

వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసింది జగనే

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బూడి ముత్యాలనాయుడు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని న్యాయం చేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కశింకోట మండలం తేగాడలో ఎస్.ఆర్.రెసిడెన్సీలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు, ఆర్థికంగా వెనుకబడిన వారికి జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే పథకాలన్నీ అమలవుతాయన్నారు.

- ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చల్లని దీవెనలు పొందుతున్నారన్నారు. అణగారిన వర్గాలకు అండగా ఉండాలని రాజ్యాంగ స్ఫూర్తితో సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని చెప్పారు.

నియోజకవర్గంలో సంక్షేమ పథకాల వెల్లువ

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ గత నెల 26న ప్రారంభమైన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతంగా కొనసాగిందని చెప్పారు. ప్రతి గ్రామంలోను ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అనకాపల్లి నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయలు సంక్షేమ పథకాల రూపంలో అమలు చేశామన్నారు. బస్సు యాత్రలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల గృహాలు నిర్మించిన ఘనత ఏ ప్రభుత్వానికి దక్కలేదన్నారు. తేగాడలో 240 గృహాలు బడుగులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ కార్పొరేషన్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.

అట్టహాసంగా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం

కశింకోట: మండలంలోని తేగాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా జగనన్న కాలనీలో ఇళ్లను మంత్రులు ప్రారంభించి వాటి లబ్ధిదారులు గోకివాడ సత్తిబాబు, లలిత (తేగాడ), బద్ది రాజు, రాము (కొత్తపల్లి) దంపతులను సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. సొంత ఇల్లు లేదా? అని ప్రశ్నించగా, 2009 నుంచి లేదని, ఇన్నాళ్లకు సొంతింటి కల నెరవేరిందని సత్తిబాబు దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. రైతు భరోసా సైతం అందుతుందన్నారు. ముందుగా మంత్రులకు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అప్పారావు దంపతులు కూడా తమ మనోభావాలు పంచుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో నాడు–నేడు నుంచి రూ.65 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులకు విద్యార్థులు మార్చ్ పాస్టుతో, పూల జల్లులతో దారి పొడవునా ఘన స్వాగతం పలికారు.



గృహప్రవేశం చేసిన గోకివాడ సత్తిబాబు దంపతులకు దుస్తులు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సచివాలయంలో సర్పంచ్‌ను కూర్చోబెట్టి...

చివరిగా రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించి, దానిలో గదులను పరిశీలించారు. సచివాలయంలో సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మను కూర్చోబెట్టి ఇక్కడ ఉద్యోగులు నిర్వహిస్తున్న విధుల గురించి వైవీ సుబ్బారెడ్డి అడిగి తెలుసుకున్నారు. సమగ్ర భూముల సర్వే పూర్తి అయిందా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడ తాజాగా రైతు భరోసా ఎంతమందికి అందిందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సేవలు గురించి, ఇంకా కల్పించాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మమేకమయ్యారు.



తేగాడ ఆదర్శ పాఠశాలలో నాడు–నేడు నిర్మాణాలను ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

రాష్ట్రానికి జగనే కావాలి

- జిల్లాలో వేడుకగా 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమం
- ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించిన ప్రజాప్రతినిధులు



నక్కపల్లి మండలం దేవవరంలో గురువారం రాత్రి ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

సాక్షి న్యూస్ నెట్‌వర్క్: సాదర స్వాగతాలు.. అడుగడుగునా నీరాజనాలు.. ప్రతి నియోజకవర్గంలోను వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణలు.. ఇలా 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమం జిల్లాలో గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా ప్రజాప్రతినిధులు, సమన్వయకర్తలు వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అందించిన విప్లవాత్మక పాలన, చేసిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన ప్రణాళికలు, దేశంలో ఎక్కడా జరగని విధంగా ప్రవేశపెట్టిన వినూత్న కార్యక్రమాలను వివరిస్తూ ముందుకు సాగారు. రాత్రి పల్లె నిద్ర చేసి, శుక్రవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి పథకాలపై ప్రచారం చేయనున్నారు. బుచ్చెయ్యపేట మండలంలోని శివారు గ్రామం మల్లాంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. పాయకరావుపేట మండటం పాల్మన్‌పేటలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల లబ్ధిపై రూపొందించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బాబూరావు నక్కపల్లి మండలం దేవవరం సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రికి గ్రామంలోనే పల్లె నిద్ర చేశారు.



తేగాడలో పార్టీ జెండాను ఆవిష్కరించిన సుబ్బారెడ్డి, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, సత్యవతి

రక్తహీనత నివారణే లక్ష్యం

వజ్రగడలో పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మాకవరపాలెం: విద్యార్థుల్లో రక్తహీనత నివారణే లక్ష్యంగా విద్య, వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. మండలంలోని వజ్రగడలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి తరగతి గదుల్లో వసతులను తెలుసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డిని ఆదేశించారు. గ్రామం నుంచి ఉన్నత పాఠశాల వరకు 800 మీటర్ల మేర పొడవున రోడ్డుకు ప్రతిపాదనలు తయారు చేయాలని పీఆర్ జేఈ వెంకటేశ్వరరావుకు సూచించారు. ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) వెంటనే అమర్చి ఆంగ్ల బోధనను సమర్థంగా అమలు చేయాలని డీఈవో వెంకటలక్ష్మమ్మను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, రక్తహీనత నివారణకు ప్రణాళిక రూపొందించి జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవోలు లక్ష్మి, మూర్తి పాల్గొన్నారు.



డీఈవో, డీఎంహెచ్‌వోలతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

బాలల్లో సృజనాత్మక స్ఫూర్తికి దోహదం



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ

- ఉత్సాహంగా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు
- విజేతలకు బహుమతులందించిన డీఈవో వెంకటలక్ష్మమ్మ

కశింకోట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ దోహదపడతుందని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.వి.ఆర్ అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆలోచనలు, అభిరుచులు కలుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు భవిష్యత్‌లో నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆప్ కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ పి. రాజారావు మాట్లాడుతూ ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణాన్ని అర్థం చేసుకోవడం అనే ప్రధానాంశంగా, ఐదు ఉప అంశాలపై పోటీలు నిర్వహించామన్నారు. స్థానిక సమస్యలు, పరిసర ప్రాంతాలలో సమస్యలను గుర్తించి వాటికి చక్కని పరిష్కారాలు చూపిన ప్రాజెక్టులను ఎంపిక చేశామన్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని ప్రతిబింబించేలా ప్రాజెక్టులు ప్రదర్శించారన్నారు.



బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా పోటీల్లో ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

రాష్ట్ర స్థాయికి ఏడు ప్రాజెక్టుల ఎంపిక

జిల్లా స్థాయి పోటీకి వచ్చిన ప్రాజెక్టుల్లో అత్యుత్తమమైన ఏడింటిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని రాజారావు తెలిపారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. వీటిలో ఎం.బి. పట్నం, దిబ్బపాలెం, లక్ష్మీపురం, నక్కపల్లి, వీరన్నారాయణం, తోటాడ, జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయన్నారు. ఈ ప్రాజెక్టులను ఈ నెల 29,30 తేదీల్లో విజయవాడలోని కె.ఎల్.యూనివర్శిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఏఎంఏఎల్ కళాశాల అధ్యాపకులు వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి, ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్ పట్నాయక్, జిల్లా సైన్స్ ఆఫీసర్ దాడి కాళిదాస్, జ్యూరీ సభ్యులు స్వాతి, సౌజన్య, మాధురి, రిసోర్స్ పర్సన్‌లు ఎ.వి. రాజగోపాల్, వి. సుజాత, మాధవి లక్ష్మి, వి.వి.గిరి, సూర్యనారాయణ, బి.ఎస్ మూర్తి, పి.వి.ఆర్ ప్రభాకర్, పాఠశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

తేగాడలో టీడీపీ ఖాళీ



బుదిరెడ్డి రామారావుకు పార్టీ కండువా వేసి ఆహ్వానించిన పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

- వైఎస్సార్‌సీపీలో చేరిన 80 మంది నాయకులు
- పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించిన వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

అనకాపల్లిటౌన్: టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు, తేగాడ పాలసంఘం అధ్యక్షుడు బుద్దిరెడ్డి రామారావు ఆధ్వర్యంలో కశింకోట మండలం కొత్తపల్లి బుచ్చియ్యపేట, తేగాడ గ్రామానికి చెందిన సుమారు 80 మంది టీడీపీ నాయకులు గురువారం వైఎస్సార్‌సీపీ తీర్థం తీసుకున్నారు. ఈ సందర్భంగా కశింకోట మండలం ఎస్ఆర్ రెసిడెన్సీలో జరిగిన సమావేశంలో బుద్దిరెడ్డి రామారావుకు పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో మలపురెడ్డి సత్యవతి (టీడీపీ మాజీ సర్పంచ్), మలపురెడ్డి దానియ్య అప్పారావు (టీడీపీ మాజీ ఎంపీటీసీ) బుదిరెడ్డి ఈశ్వరరావు (టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు), ముత్యాల నాగేష్, తిర్రి ఈశ్వర వెంకట నాగేష్, కర్ణం నాయుడు, సుంకర నాగ సూరి అప్పారావు, జోగాడ మాణిక్యం, సుంకర అన్నవరం, సుంకర నాగేశ్వరరావు, మాటూరి సత్యారావు, ద్వారపురెడ్డితో పాటు మరికొంత మంది పార్టీ కండువా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలాబులో వైఎస్సార్‌సీపీలో చేరిక

దేవరాపల్లి: మండలంలోని వాలాబు పంచాయతీ శివారు కోడాపల్లిలో సీపీఎం మద్దతుదారులైన గిరిజనులు ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారు. కోడాపల్లిలో సీపీఎం మద్దతుదారులుగా నిలుస్తున్న 17 గిరిజన కుటుంబాలు స్వచ్ఛందంగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు గురువారం తారువ క్యాంప్ కార్యాలయానికి విచ్చేసిన గిరిజన కుటుంబాలకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు వైఎస్సార్‌సీపీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. దశాబ్దాల కాలం నుండి సీపీఎం నాయకులు వారి స్వార్ధ రాజకీయాలు కోసం, ఉనికిని చాటుకునేందుకు తమ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని తీవ్ర అన్యాయానికి గురిచేశారని పార్టీలో చేరిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి నిరోధకులుగా మారిన సీపీఎంను వీడి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మారుమూల గిరిజన గ్రామాలకు సైతం రోడ్లు, మంచినీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించిన ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు నాయకత్వంలో పని చేయాలని తామంతా నిర్ణయించుకున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో కాశీ సన్నిబాబు, చెరుకు లక్ష్మణ, రాంబాబు, గంగన్నదొర, కాశీ అప్పన్న, పేరయ్య, సుదర్శన్, పెంటయ్య, శ్రీను, పైడితల్లి, గమ్మెల ఎరకన్న, డిర్రపుబోయిన నూకరాజు, పైడితల్లి, సోమల దేముడు, చినదేముడు తదితర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు సూరినాయుడు, వాలాబు వైఎస్సార్‌సీపీ నాయకులు పోడెల నానిబాబు, వరహాల దొర, మావోలుదొర, బలిజ చిన్న, రాజులమ్మ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన కోడాపల్లి గిరిజన కుటుంబాలతో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

బాలికపై అఘాయిత్యం

నక్కపల్లి: మండంలో ఒక మత్స్యకార గ్రామంలో మానసిక దివ్యాంగురాలైన మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే ఈ గ్రామంలో మైనర్ బాలిక ఈ నెల 5వ తేదీన చర్చికి ప్రార్ధన కోసం వెళ్లి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి బాలికను తన ఇంట్లోకి పిలిచి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమెను లైంగికంగా వేధించి అత్యాచారానికి ప్రయత్నించినట్టు బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పినట్లు సమాచారం. ఇన్నాళ్లు కుటుంబ పరువు కోసం వేచి ఉన్న కుటుంబ సభ్యులు ఈ విధమైన ఘటన మరొకరికి జరగకూడదన్న ఉద్దేశ్యంతో పెద్దల సూచనల మేరకు గురువారం నక్కపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బాధితురాలని వైద్య పరీక్షల కోసం పంపించినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి



అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో గురువారం ఓ మహిళ మృతి చెందింది. ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ అందించిన వివరాలివి. కొత్తూరు గ్రామం నుంచి గాజువాక వైపు స్కూటీపై వెళ్తున్న అదే గ్రామానికి చెందిన డి.సూర్యకుమారి(47)ని నూకాంబిక ఆర్చి వద్ద వెనుక వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో సూర్యకుమారి అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాఫిక్ పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

ఈకోర్రా లిఫ్టర్లకు పతకాల పంట



ప్రియదర్శిని, సంతోషి, రమణ, సత్యజ్యోతి

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా రైల్వే వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఈకో రైల్వే వాల్తేర్ లిఫ్టర్లు పతకాలు సాధించారు. వెస్టర్న్ రైల్వే ముంబయిలో 70వ మెన్, 9వ వుమెన్ చాంపియన్‌షిప్ జరిగింది. 45 కిలోల వెయిట్‌లో టి.ప్రియదర్శిని రజతం, 55 కిలోల వెయిట్‌లో ఎం.సంతోషి కాంస్య పతకం అందుకుంది. 67 కిలోల వెయిట్ కేటగిరీలో కె.రమణ, 87 కిలోల వెయిట్‌లో టి.సత్యజ్యోతి కాంస్య పతకాలు సాధించారు. వీరిని డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ అభినందించారు.

దిబ్బిడిలో అతిసార విజృంభణ

- వృద్ధుడి మృతి
- కలుషిత నీరే కారణమంటున్న గ్రామస్తులు



మృతి చెందిన దేవుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరిడమ్మ

బుచ్చెయ్యపేట: మండలంలోని దిబ్బిడిలో కలుషిత నీరు తాగడం వల్ల అతిసార (డయేరియా) విజృంభించింది. వాంతులు, విరేచనాలతో ఒకరు మృతి చెందగా, ఐదుగురు ఆస్పత్రిలో చేరారు. ఇటీవల ఇక్కడ కొత్తగా నిర్మించిన మంచినీటి ట్యాంక్ క్లోరినేషన్ చేయకపోవడం వల్ల మంచి నీరు కలుషితమై అతిసార విజృంభించినట్లు వైద్యులు తెలియజేస్తున్నారు. గ్రామానికి చెందిన జెర్రిపోతుల దేవుడు(68) మూడు రోజులుగా వాంతులు, విరోచనాలతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఇదే సమస్యతో జాజిమొగ్గల మరిడమ్మ, గాడి లచ్చమ్మ, గంట కొల్లమ్మ, అద్దెపల్లి ఝాన్సీ తదితరులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. మరికొంత మంది ఇంటి వద్ద అవస్థలు పడుతున్నారు. అతిసార అదుపులోకి వచ్చేలా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే ఇక్కడ పారిశుధ్యం మెరుగ్గానే ఉందని పంచాయతీ సెక్రటరీ చెప్పగా, కొత్తగా నిర్మించిన మంచినీటి ట్యాంక్‌ను క్లోరినేషన్ చేయకపోవడం కలుషిత నీరు తాగి అతిసార వ్యాపించి ఉండొచ్చని వైద్య సిబ్బంది తెలియజేస్తున్నారు. కలుషిత నీటిని శాంపిల్ తీయించి ల్యాబ్‌కు పంపించినట్లు బుచ్చెయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు కేవీ కృష్ణ తెలిపారు.

సారాతో ఇద్దరు అరెస్టు

మాడుగుల: మండలంలో ఎల్.గదబవీది గ్రామ సమీపంలో ముందస్తు సమాచారంతో విక్రయానికి సిద్ధం చేసిన 8 లీటర్ల నాటుసారాతో పాటు 900 లీటర్ల సారా పులుపును ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)సీఐ సింహాద్రి తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారం ప్రకారం ఎల్. గదబవీధి గ్రామ సమీపంలో దాడులు చేపట్టగా 900 లీటర్ల బెల్లం పులుపు పట్టుబడిందని, దానిని ధ్వంసం చేశామని, అలాగే 8 లీటర్ల సారా విక్రయిస్తున్న వంతల దేముడు, వంతల నాగరాజులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఈబీ సీఐ తెలిపారు.



సారా పులుపు ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ పోలీసులు

ట్రాక్టరు పైనుంచి దుంగలు పడి డ్రైవర్ మృతి

పాయకరావుపేట: ట్రాక్టర్ పైనుంచి బరువైన దుంగలు జారిపడడం వల్ల ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. నక్కపల్లి మండలం రేబాక నుంచి వేప దుంగలను వేసుకుని ట్రాక్టరుతో పట్టణంలో గల సామిల్లుకు తీసుకొచ్చారు. ట్రాక్టరును సామిల్లు వద్ద నిలిపారు. ట్రాక్టరులో 8 టన్నులు బరువు గల దుంగలు ఉండడంతో ట్రాక్టరు ఇంజిన్ భాగం పైకి తేలింది. దీంతో డ్రైవర్ బోడపాటి జగ్గులు (55) ట్రాక్టర్ తొట్టికి, ఇంజిన్‌కి మధ్యలో పడిపోవడంతో తొట్టిలో ఉన్న దుంగలు జారిపడ్డాయి. దీంతో డ్రైవర్ జగ్గులు తలకు బలమైన గాయం కావడంతో పాటు ఊపిరి ఆడక మరణించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన డ్రైవరు జగ్గులు

విద్యతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యం

- ఎంపీపీ సుర్ల రాజేశ్వరి
- జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం

నర్సీపట్నం: ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్సీపట్నం మండలం, వేములపూడి సీబీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి బేస్ బాల్ సెలక్షన్ పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రతిభను కనబరిచేందుకు ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పించిందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపు రేఖలు మార్చేశారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోని విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలోని విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుండి 400 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 30 మంది వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సెలక్షన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు బోళెం రాంప్రసాద్, బోళెం వెంకటేష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోళెం నర్సింహమూర్తి, వైస్‌సర్పంచ్ సుర్ల శేఖర్, పాఠశాల హెచ్ఎం రామకృష్ణ , స్కూల్ కమిటి చైర్మన్ అంకంరెడ్డి వరహాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాలి

అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్ర జిల్లాల్లో గత నెల 26న ప్రారంభమైన సామాజిక సాధికార బస్సుయాత్రకు ప్రజల నుంచి అపూర్వమైన స్పందన వస్తుందని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. అనకాపల్లి మండలం మారేడుపూడి జాతీయ రహదారిలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేసిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. పాడేరు జిల్లాకు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టారన్నారు. గిరిజనులకు పట్టాలివ్వడమే కాకుండా వారి ప్రాంతానికి చెందిన పీడిక రాజన్నదొరను ఉప ముఖ్యమంత్రి చేశారన్నారు. వీటిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు.

- పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ దేశంలో నేటి వరకు ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా మన రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు నాలుగున్నరేళ్లలో అమలు చేసి చూపించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మహానేత రాజశేఖర్‌రెడ్డి కంటే మరిన్ని పథకాలను అమలు చేసి రాష్ట్ర ప్రజలు మన్ననలను పొందారన్నారు.
- పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు మాట్లాడుతూ 14 ఏళ్లపాటు సీఎంగా చేసిన చంద్రబాబు రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తే, సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించారన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు బీసీ గర్జనలో బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని, బీసీ అంటే బ్యాక్ బోన్ అని చెప్పి చేతల్లో చేసి చూపారన్నారు. రూ.2 లక్షల 38 వేల కోట్లు డీబీటీ పద్ధతి ద్వారా సంక్షేమ పథకాల రూపంలో అర్హులైన లబ్ధిదారులకు ఇచ్చారన్నారు. బీసీలకు నామినేటెడ్ పదవులిచ్చి ఉన్నత శిఖరాలను చేర్చిన ఘనత దక్కిందన్నారు.

జైల్లో ఖైదీలకు న్యాయపరమైన హక్కులుంటాయి

సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

చోడవరం రూరల్: జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలకు న్యాయపరమైన హక్కులు ఉంటాయని, వాటిని పరిరక్షించడం కోర్టుల ప్రధాన విధి అని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ అన్నారు. గురువారం జాతీయ న్యాయసేవా దినోత్సవంలో భాగంగా స్థానిక సబ్‌జైలులో ఖైదీలకు, కోర్టుల సముదాయంలో కక్షిదారులకు న్యాయ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అరుణశ్రీ సబ్‌జైలు ఖైదీలనుద్దేశించి మాట్లాడుతూ నేరారోపణపై జైలు పాలైన ఖైదీలు తమ తరపున వాదించేందుకు న్యాయవాదిని నియమించుకోలేని పరిస్థితి ఉంటే కోర్టు వారికి న్యాయ సహాయాన్ని సైతం అందచేస్తుందని తెలిపారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ మాట్లాడుతూ ఖైదీలైనా నేరం రుజువైనావారు సామాన్య పౌరులేనని, వారి ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా చూడాల్సింది కోర్టులేనని అన్నారు. అనంతరం జైలు పరిసరాలను, ఖైదీల గదులతోపాటు వారికి తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. కోర్టుల సముదాయంలో కక్షిదారులకు చోడవరం బార్ అసోసియేషన్ సహకారంతో న్యాయసేవా సదస్సును నిర్వహించారు. కక్షిదారులను ఉద్దేశించి న్యాయమూర్తులు అరుణశ్రీ, స్వర్ణలు మాట్లాడుతూ సత్వర న్యాయం అందించాలన్నదే కోర్టుల ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర న్యాయశాఖ ఆదేశాలతో తరచూ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ మాట్లాడుతూ కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ఉపయోగాలను వివరించారు.

శ్రీవారి సన్నిధిలో ధీరజ్ గానం



నర్సీపట్నం: నర్సీపట్నంకు చెందిన బాలగాయకుడు ధీరజ్ తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో తన గానంతో అలరించాడు. స్వామి వారి సన్నిధిలో అన్నమయ్య గానం చేసేందుకు తిరుముల తిరుపతి దేవస్థానం అధికారులు అవకాశం కల్పించారు. దేశదేశాల్లో తన గానంతో అలరిస్తూ ధీరజ్ పలువురు మన్ననలు పొందుతున్నాడు. స్వామి వారి సన్నిధి నాద నీరాజనం మండపంలో అన్నమయ్య సంకీర్తనలతో ధీరజ్ భక్తులను విశేషంగా ఆక ట్టుకున్నాడు. ధీరజ్ పాడిన వాసంతి రాగంలో మానుపవ సమ, మధ్యమావతి రాగంలో ఏమని చెప్పవచ్చు కీర్తనలు అలరించాయి. స్వామి వారి సన్నిధిలో నాదనీరాజనంలో పాడడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని ధీరజ్ తెలిపాడు.

కానిస్టేబుల్‌పై యువకుల దాడి

మద్రిపాలెం: న్యూసెన్స్ చేస్తున్న యువకులను వారించిన కానిస్టేబుల్‌పై దాడి జరిగింది. ఈ ఘటన ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కంచరపాలెం బర్మాక్యాంపులో విజయరాజు, నీలపు వరప్రసాద్ న్యూసెన్స్ చేస్తున్నారంటూ స్థానికుడు గురువారం డయల్ 100కి ఫిర్యాదు చేశాడు. దీంతో బ్లూకోట్ కానిస్టేబుల్ అక్కునాయుడు బర్మాక్యాంప్ వెళ్లి ఆ యువకులను వారించగా.. వారిద్దరూ అతనిపై దాడి చేశారు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

యువకుడిపై పోక్సో కేసు

సీతమ్మధార : బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడిపై ద్వారకా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీతంపేటకు చెందిన ఓ వివాహిత బాలుడు, బాలికతో కలిసి నివాసం ఉంటోంది. భర్త మరణించడంతో ఇంటి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటుంది. అదే ప్రాంతానికి చెందిన సత్యనారాయణ(40) అనే వ్యక్తి బుధవారం బాలిక ఇంటి వద్ద ఒంటరిగా ఉండడం గమనించిన సత్యనారాయణ మద్యం మత్తులో వెళ్లి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారంతా వచ్చి నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

క్లుప్తంగా

కాస్త తగ్గిన ఉల్లి ధర



కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం ఉల్లిపాయ ధర కాస్త తగ్గింది. గత వారం కిలో రూ.60 ఉండగా, ఈ వారం రూ.50కి తగ్గింది. ఇక టమాటా ఎప్పటిలానే రూ.40, బంగాళాదుంప రూ.20, వంకాయ రూ.30, బెండకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ రూ.60, బీన్స్, కేప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

12న లయన్ ఎన్విరాన్‌మెంట్ ర్యాలీ

అనకాపల్లిటౌన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ ఎన్విరాన్‌మెంట్ ర్యాలీ ఈ నెల 12న నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వి.వెంకటరాజు, కార్యదర్శి బి.అప్పలరాజులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటలకు ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్థానిక రింగ్‌రోడ్డు నుంచి పట్టణంలోని నెహ్రూచౌక్ కూడలి వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. క్లబ్ ఆధ్వర్యంలోని వాకర్స్ అందరూ హాజరుకావాల్సిందిగా కోరారు.

ప్రజారోగ్య వేదిక వైద్య శిబిరాలు

అనకాపల్లిటౌన్: ప్రజారోగ్య వేదిక వైద్యశిబిరాలు వచ్చే ఏడాది జనవరి, మార్చి, మే, జూలై, సెప్టెంబర్, నవంబర్ మాసాల్లో ప్రతి నెలా రెండో ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా కార్మిక, కర్షక నిలయంలో నిర్వహించనున్నట్లు వేదిక ప్రతినిధులు మళ్ల చంద్రశేఖర్, బి.నూక అప్పారావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరాల్లో వైద్యులు బి.సాంబమూర్తి, బి.నీలేంద్రకుమార్, కె.దివాకర్‌రావు, కె.మానసలు హాజరై రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు జరిపి, అవసరమైన మందులు అందిస్తారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: పట్టణ రహదారుల అభివృద్ధిలో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్‌స్తంభాలను తొలగించే చర్యల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ(ఆపరేషన్స్) కె.రాజశేఖర్, ఏఈ ఎం.శ్రీనివాసరావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంజయ్యకాలనీ, గాంధీనగర్, శ్రీరాంనగర్, న్యూబర్మాకాలనీ, లక్ష్మీదేవిపేట, మిరియాలకాలనీ, విజయరామరాజుపేట, ఏఎంసీకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 2,015 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,800	4,240
రెండో రకం	3,460	4,070
మూడోరకం	3,150	3,760

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
జపాన్	: సత్యనారాయణస్క్రీన్-1
ద మార్వెల్స్(తెలుగు)	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
అలా నిన్ను చేరి	: శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-2 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 395 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



సామాజిక సాధికార సభా వేదికపై బెలూన్లు ఎగురవేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సామాజిక సాధికార బస్సు యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి అమర్‌నాథ్



తేగాడలోని ఆదర్శ పాఠశాలలో మార్చ్‌పాస్ట్‌తో బస్సుయాత్రకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



ర్యాలీలో బైక్ డ్రైవింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, సత్యవతి

అడుగడుగునా నీరా'జనం'

- బస్సు యాత్రకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- రెండు కిలోమీటర్ల పొడవున బైక్ ర్యాలీ

తుమ్మపాల: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర గురువారం ఉదయం అనకాపల్లి-విశాఖ రహదారిపై మండలంలోని మారేడుపూడి జంక్షన్ నుంచి ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, స్థానిక నేతలు సాదర స్వాగతం పలికారు. మారేడుపూడి జంక్షన్‌లో బస్సు యాత్రను ప్రారంభించి జాతీయ రహదారి మీదుగా సిరసపల్లి, కేఎస్‌ఆర్‌పేట, కొప్పాక, అనకాపల్లి బైపాస్ నుంచి నేరుగా కశింకోట మండలం తేగాడ గ్రామానికి చేరుకున్నారు. మారేడుపూడి నుంచి ప్రారంభమైన బస్సు యాత్రతో పాటు వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ శ్రేణులు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా తరలివచ్చారు. దాదాపు రెండు కిలోమీటర్ల పొడవున ద్విచక్ర వాహనాల ర్యాలీ కొనసాగింది. మంత్రి అమర్‌నాథ్ మారేడుపూడి నుంచి బస్సుపై నిల్చుని, పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తు యాత్రను కొనసాగించారు. డీజే సౌండ్స్‌తో జగనన్న, సంక్షేమ పథకాలపై పాటలతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. జై జగన్.. జైజై జగన్ అంటూ యువత నినాదాలతో ర్యాలీ మార్మోగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్‌గణేష్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలో సామాజిక సాధికార బస్సు యాత్ర ఘనంగా జరిగింది. ఐదు కిలో మీటర్ల మేర యాత్ర సాగడానికి దాదాపు గంట సమయం పట్టింది. అనకాపల్లి మండలం నుంచి వచ్చిన బస్సు యాత్ర గురువారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో కశింకోట గ్రామంలో ప్రవేశించింది. అక్కడి నుంచి జాతీయ రహదారిపై బయ్యవరం మీదుగా తేగాడ గ్రామం వరకు సాగింది. భారీ ఎత్తున బైక్‌లతో ర్యాలీ, కార్ల కాన్వాయి అనుసరించాయి. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బస్సుపై నిల్చొని ప్రజలకు దారి పొడవునా అభివాదం చేశారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి మండలాధ్యక్షుడు గొర్లి సూరిబాబు ఉన్నారు. యాత్ర బయ్యవరం నుంచి తేగాడ వైపు వెళ్లే మార్గం వద్దకు చేరుకున్నాక మంత్రి తన బస్సులో నుంచి కిందికి దిగి, ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి ఉన్న బస్సులోకి చేరుకున్నారు.

సామాజిక సాధికారతలో..

అనకాపల్లిలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలంలోని నరసింగబిల్లి నుంచి దివ్యాంగులు గురువారం తరలి వెళ్లారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో సభ్యులు బస్సు యాత్రకు బయలుదేరారు. మండల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఎంపీ భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పలకా రవి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఆలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కె.ఎం.నాయుడు, ఆళ్ల నాగేశ్వరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు మలసాల కిషోర్, పెదిశెట్టి గోవింద, సచివాలయ మండల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, నాయకులు నీటిపల్లి దివాకర్, భరత్ పాల్గొన్నారు.



సచివాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచ్ చాంబర్లో నేతలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్



అంగన్‌వాడీ చిన్నారులతో ముచ్చటిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్, బీవీ సత్యవతి



వెల్‌నెస్ సెంటర్లో రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తదితరులు

రైతన్నకు ఆర్థిక భరోసా

- వరుసగా ఐదో ఏడాది పెట్టుబడి సాయం
- 53,391 మందికి రూ.22.06 కోట్ల లబ్ధి

వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయం పండగలా మారింది. దండగ అన్న టీడీపీ నోళ్లు మూతబడ్డాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయరంగంలో అమలు చేస్తున్న వినూత్న పథకాలు రైతుల ఇంట వెలుగులు నింపుతున్నాయి. పంటల సాగుకు పెట్టుబడి సాయం అందుతుండడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్ల ఆరంభంలోనే రైతు భరోసా నిధులు మంజూరు చేయడంతో సాగు పెట్టుబడులకు ఉపశమనం లభిస్తోంది.

అనకాపల్లి రూరల్: రైతులను ఆదుకోవడంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఒక అడుగు ముందుకేస్తే.. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పది అడుగులు ముందుకేస్తున్నారు. గత పాలకులు దండగ అన్న వ్యవసాయాన్ని పండగ చేసి చూపించారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మి, వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. రైతు భరోసా కింద ఏటా ఒక్కో రైతుకు రూ.13,500 అందజేస్తున్నారు. ఈ నెల 7న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేశారు. అనకాపల్లి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 5 మండలాల్లో 53,391 మంది రైతులకు 22 కోట్ల 6లక్షల 59 వేల రూపాయల మేర లబ్ధి చేకూరింది. ఒక్కో రైతు ఖాతాలో రూ.4 వేలు చొప్పున నిధుల జమ అయింది.

కౌలు రైతులకు ప్రభుత్వం అండ

భూ యాజమాన్య రైతులకే కాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకూ అండగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం యాజమాన్య రైతులకు మాత్రమే పీఎం కిసాన్ నిధులు మంజూరు చేస్తోంది. జగన్ ప్రభుత్వం కౌలు రైతులకు సైతం పెట్టుబడి సాయం అందిస్తోంది. సబ్ డివిజన్‌లో 289 మంది కౌలు రైతులకు, దేవదాయ కౌలు రైతులకు రూ.11.56 లక్షలు మంజూరైంది. వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గడచిన నాలుగున్నరేళ్లలో వినూత్న పథకాలు అమలు చేస్తూ రైతులకు అన్ని విషయాల్లోనూ అండగా ఉంటోంది. నియోజకవర్గానికొక అగ్రిల్యాబ్ ఏర్పాటు చేసి నిపుణులతో విత్తనాలు విత్తే సమయం నుంచి పంటకోత వరకు తగిన సూచనలు, సలహాలు అందించేలా చర్యలు తీసుకుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు ముంగిటకే ఎరువులు, విత్తనాలు సహా అన్ని సేవలు అందుతున్నాయి.



తుమ్మపాల రైతు భరోసా కేంద్రంలో జాబితాలను పరిశీలిస్తున్న రైతులు



సబ్బవరం మండలం నారపాడులో రైతు భరోసా జాబితాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది

మాట నిలబెట్టుకున్నారు



పాదయాత్ర చేసే సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తానని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఐదేళ్లుగా ఏటా రూ.13,500 చొప్పున రైతుల ఖాతాలకు జమ చేస్తున్నారు. మాలాంటి రైతులకు సాగు సాయం ఎంతో ఉపయోగపడుతోంది. రైతు పక్షపాతి అని జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారు.

– శనివాడ అరుణ, మహిళారైతు, వెదురుపర్తి

చెప్పారంటే చేస్తారు



నాకు ఎకరం పొలం ఉంది. అందులో వరి పండిస్తాను. ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ13,500 పెట్టుబడి సాయం నా ఖాతాకు జమ అవుతోంది. ఇది వ్యవసాయ మదుపులకు ఉపయోగపడుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే నెరవేర్చుతారు. రైతులను ఈ స్థాయిలో ఆదుకున్న నాయకుడు మరొకరు లేరు.

– కొణతాల శ్రీనివాస్, రైతు, అనకాపల్లి

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. కౌలు రైతులకు కూడా పెద్ద ఎత్తున రైతు భరోసా ఆర్థిక లబ్ధిని చేకూరింది. ఈ పథకాలు, సేవలను రైతులు సద్వినియోగపర్చుకోవాలి. గడచిన నాలుగున్నరేళ్లలో రైతుల కోసం ఎన్నో సంస్కరణలు అమల్లోకి వచ్చాయి.

– ఎం రామారావు, ఏడీఏ, అనకాపల్లి

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం



కన్నూరుపాలెంలో ఔషధ మొక్కలపై అవగాహన కల్పిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి లావణ్య



ఆయుర్వేదంపై తాళ్లపాలెం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ విద్యార్థులు నడక ర్యాలీ, సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఆయుర్వేదం ప్రాముఖ్యత గురించి వ్యాసరచన, చిత్ర లేఖనం, వక్తృత్వ పోటీలను పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించారు. రైతులు, వ్యవసాయ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులకు ఔషధ మొక్కలు, ఆయుర్వేదం, యోగాపై అవగాహన కలిగించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ సిబ్బందితో ఆయుర్వేదంపై ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు కూరగాయలు పెంపకం, ఆరోగ్యకరమైన వంటలపై పోటీ నిర్వహించారు. జి.భీమవరం, సుందరయ్యపేట గ్రామాల్లోనూ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అనకాపల్లిటౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప సూచించారు. స్థానిక రింగ్‌రోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో ఉచిత న్యాయసేవలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలకు రక్షణగా అనేక చట్టాలు ఉన్నాయని, 498ఏ వంటి పది చట్టాలను వివరించారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికాయుతంగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు భరతలక్ష్మి, కుమారి, నాగేంద్రదేవి, లీల, కళాశాల ప్రిన్సిపాల్ పరమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రదీప

భారత్ వికాస్ పరిషత్ క్విజ్ పోటీలు

అనకాపల్లిటౌన్: స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు భారత్ వికాస్ పరిషత్ అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో భారత్ కో జానో (భారతదేశం కోసం తెలుసుకో) అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన దంత వైద్యుడు ఎస్.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ దేశంపై ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకోవాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉన్న విషయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉన్నట్లయితే దేశంపై భక్తిభావం పెరుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాజమహేంద్రవరంలో ఈ నెల 19న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పరిషత్ కో చైర్మన్ ఎం.ఉమామహేశ్వరరావు, పట్టణశాఖ అధ్యక్షుడు ఓంరాం, కార్యదర్శి ఎస్ఏబీ వర్మ, కోశాధికారి శివరాం, సభ్యులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో పరిషత్ సభ్యులు

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

మునగపాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. అనకాపల్లిలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు ఘన స్వాగతం పలికేందుకు బొడ్డేడ ప్రసాద్ సారథ్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతోపాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించేందుకే ఈ బస్సు యాత్ర చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జై జగన్.. జైజై జగన్ అంటూ నినదిస్తూ బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు. పలువురు పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

ఘనంగా గౌరీ పరమేశ్వరుల నిలుపు ఉత్సవం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గౌరీ పరమేశ్వరులను గ్రామంలో డప్పు వాయి ద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయంలో విగ్రహాలను ప్రజల దర్శనార్థం ఉంచారు.ఈ సందర్భంగా గ్రామస్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని పూజలు చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారి సన్నిధిలో రామకృష్ణ తదితరులు

నక్కపల్లి: మండలంలో చినరామభద్రపురం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో ఆంజనేయ హోమం, స్వామివారికి తమలపాకులతో పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. స్వామివారిని ఏపీ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరక్టర్ వీసం రామకృష్ణ, పాయకరావుపేట ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ దండు బలరామరాజు, ఉపసర్పంచ్ వేగేశ్న చంటి, గుంటపల్లి ఎంపీటీసీ పల్లేల లచ్చబాబు, పి.రాజారావు, వైఎస్సార్‌సిపి నాయకులు రమేష్‌బాబు తదితరులు దర్శించుకున్నారు.

గంగాదేవిపేటలో సీఐ పర్యటన

మునగపాక: మండలంలోని గంగాదేవిపేటలో గురువారం యలమంచిలి సీఐ గఫూర్ పర్యటించారు. గ్రామంలోని చెరువును కొంతమంది ఆక్రమించి పాకలు నిర్మించుకున్నారంటూ అందిన ఫిర్యాదులో భాగంగా ఆయన సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. దీనికి తోడు బుధవారం మునగపాకలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆక్రమణలకు సంబంధించిన పాకలు తొలగించట్లేదంటూ జేసీ జాహ్నవికి స్థానికుల నుంచి ఫిర్యాదు అందింది. దీనిపై కూడా విచారణ చేపట్టాలని కలెక్టరేట్ నుంచి ఆదేశాలున్నాయి. ఈ మేరకు గఫూర్ తన సిబ్బందితో కలిసి వివాదాస్పద చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు.